అడుగుకో గుంత.. గజానికో గొయ్యి

- దువ్వాడ రైల్వేస్టేషన్ ఎస్టీబీఎల్, జగ్గరాజుపేట అనుసంధాన రహదారి అధ్వానం
- పట్టించుకోని నాయకులు, అధికారులు


దువ్వాడ వీఎస్ఈజెడ్ గేటుకు సమీపంలో అధ్వానంగా రోడ్డు


దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద గోతులమయంగా మారిన రహదారి

అగనంపూడి: అడుగుకో గుంత..గజానికో గొయ్యి ఇది అగనంపూడి సమీపంలోని రహదారుల పరిస్థితి. దువ్వాడ రైల్వేస్టేషన్,ఎస్టీబీఎల్, జగ్గరాజుపేట, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల అనుసంధాన రహదారులు ఛిద్రంగా మారాయి. రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి వీఎస్ఈజెడ్ గోడను ఆనుకొని రైల్వే లైన్ల మధ్య 30 అడుగుల రహదారి రైల్వే స్థలంలో ఉండడంతో రహదారిని పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది వీఎస్ఈజెడ్ కార్మికులు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రైళ్ల ద్వారా వచ్చి దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దిగుతారు. వీరంతా నిత్యం ప్రయాణం చేసే ఈ మార్గం నరయప్రాయంగా మారడంతో బెంబేలెత్తుతున్నారు. అలాగే సబ్బవరం పరిసర గ్రామాల నుంచి ఎస్టీబీఎల్, జగ్గరాజుపేట, గోపాలపట్నం, షీలానగర్‌లు వెళ్లేందుకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో రహదారిమొత్తం గోతులతో ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు లేకపోవడం, వర్షపు నీరు రోడ్డుమీదే నిల్వ ఉండిపోవడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కూర్మన్నపాలెం నుంచి ఫకీర్‌తక్యా మీదుగా వాహనాలు వెళ్లే అవకాశం ఉన్నా రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి అస్తవ్యస్తంగా మారడంతో వాహనచోదకులు ఫీట్లు చేస్తూ పాట్లు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఈ మార్గాన్ని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ పాట్లు.. ఫీట్లు..



ఈ మార్గంలో ప్రయాణికులు, విద్యార్థులు, స్థానికులు పాట్లు పడుతూ ఫీట్లు చేస్తున్నారు. రోడ్డుకు రెండు వైపులా డ్రైనేజీలు లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు జలమయంగా మారుతోంది. దీంతో గోతులు ఏర్పడి వాహనచోదకులకు ప్రాణ సంకటంగా మారుతోంది. జీవీఎంసీ అధికారులు స్పందించి వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని పునర్నిర్మించాలి.

–కొయ్య రాంబాబు, అగనంపూడి నిర్వాసితకాలనీ

జీవీఎంసీ కమిషనర్ దృష్టి సారించాలి



వేలాది మందికి ఉపయోగపడే ఈ మార్గ విషయంలో ఇంత నిర్లక్ష్యం వహించడం తగదు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు నిర్మించి రహదారి శిథిలాలు తొలగించి కొత్తగా రహదారి నిర్మించాలి. వేలాది మంది విద్యార్థులు, ఎస్టీబీఎల్, జగ్గరాజుపేటకు చెందిన ప్రయాణికులు నిత్యం రాకపోలు సాగిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

–వాదపల్లి రామచంద్రరాజు, కూర్మన్నపాలెం

క్లుప్తంగా

సంజీవరావు సేవలు అమోఘం


స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావు సేవలు నిరుపమానమని కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, జె. అయోధ్య రామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం సంజీవరావును ఉద్యోగకార్మిక నాయకులంతా ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన సంజీవరావు అంచలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని 26 కార్మిక సంఘాలు, ఉక్కు అధికారుల సంఘం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఓబీసీ ఉద్యోగుల సంఘాలను సమన్వయం చేయడం ద్వారా ఐఆర్ సమస్యలు లేకుండా చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా ఎస్సీ, ఎస్టీ నూతన కమిటీను 69వ వార్డు షీలానగర్‌లో ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన నూతన కమిటీలో గౌరవాధ్యక్షురాలుగా వనజాక్షి, అధ్యక్షుడిగా ఈ.మంగరాజు, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, కె.రాము, కార్యదర్శులుగా జాన్, మేరీ, సంయుక్త కార్యదర్శులుగా త్రివేణి, ఎం.రమేష్ బాబు, కోశాధికారిగా తెగాటి వసంత్ కుమార్, సంయుక్త కోశాధికారిగా తారక్, లీగల్ అడ్వజర్లుగా స్వామి ఈశ్వర్, వై.వెంకటేశ్వరరావు, సంయుక్త అడ్వజర్‌గా ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గిరి, యల్లారావు, రమేష్ బాబు, జి.సింహాచలం, వెంకట్, ఈశ్వరరావు, శివలు ఎన్నికైనట్లు గౌరవాధ్యక్షురాలు వనజాక్షి తెలిపారు. రెండేళ్ల పాటు నూతన కమిటీ తమ విధులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి

అగనంపూడి: రోడ్డు ప్రమాదాలకు గల కారణాలు, రహదారి భద్రతపై జన జాగృతం చేయాల్సిన అవసరం ఉందని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పల్లా కార్తీక్ సేవా ట్రస్ట్ సారధ్యంలో అగనంపూడి జాతీయ రహదారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. వాహనాల వాడకం ఏడాకేడాది రెట్టింపు అవుతుందని, అధికశాతం మంది వాహనచోదకులు వేగంగా గమ్యాన్ని చేరుకోవాలనే తలంపుతో ట్రాఫిక్ నిబంధనలను కూడా పట్టించుకోకుండా ప్రయాణం సాగిస్తున్నారన్నారు.కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాబూరావుకు ఘన సత్కారం


బాబూరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు సేవలు ఎనలేనివని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాకలోని శ్రీ కృష్ణ కళ్యాణ మండపంలో పదవీ విరమణ సందర్భంగా బూబూరావు దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఇంటక్ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ భెల్ (హెచ్‌పీవీపీ)లో గుర్తింపు యూనియన్ మాజీ కార్యదర్శిగా ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో అప్పారావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, స్టాలిన్, రాష్ట్ర కబడ్డీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు గవర వెంకట రమణారావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వపై అధికారుల కొరడా


మంగళపాలెంలో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన వ్యక్తిని ఆరా తీస్తున్న అధికారులు

అగనంపూడి: అక్రమంగా ఇసుక నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కొరడా ఝుళిపించారు. కేసు నమోదు చేసి ఇసుకను స్వాధీనం చేసుకొని రూ.25వేల జరీమానా విధించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో లక్ష్మణనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని దువ్వాడ, మంగలపాలెం, వెదుళ్లనరవ పరిసర ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు ఇసుకను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గాజువాక తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందడంతో ఆదివారం ఈ ప్రాంతంలో దాడులు చేశామని చెప్పారు. రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఇసుక నిల్వలపై దాడులు చేయగా, మంగళపాలెంలో నకిలీ బిల్లులతో 18 టన్నుల ఇసుకు అక్రమంగా నిల్వచేసినట్టు గుర్తించామని, ఈమేరకు ఇసుకను సీజ్ చేసి రూ.25వేల జరీమానా విధించినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.లక్ష్మణనాయుడు చెప్పారు. దాడుల్లో ఆర్ఐ మంగరాజు, వీఆర్వో స్వరూప్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వడ్లపూడిలోని లక్ష్మీపురం త్రిశక్తి దేవాలయం పరిసరాల్లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొండా జగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎ. మురళీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ప్రసాద్ నాయుడు, లక్ష్మణరెడ్డి, కె.వి. ప్రసాద్, శంకరరావు, ఎ.ఎస్.ఎస్.డి. ప్రసాద్, రవికుమార్, రామరాజుతో పాటు త్రిశక్తి దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న స్థానికులు

అగనంపూడి: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని వైద్యులు రవిశంకర్, రాజశేఖర్ అన్నారు. 79వ వార్డు అగనంపూడి అభిరామ్ గేటెడ్ కమ్యూనిటీ ఆవరణలో సత్యసాయి సేవా సమితి, అభిరామ్ అపార్ట్‌మెంట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్త సారధ్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అటువంటి వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉంటుందన్నారు. రక్తం అనేది కొనుక్కుంటే దొరికే వస్తువు కాదని, దాతలు, సహృదయులు మానవతాదృక్పథంతో సహాయం చేస్తే దొరికే వెలకట్టలేని నిధి అన్నారు. ఈ సందర్భంగా 78 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ఉక్కునగరం కమిటీ కన్వీనర్ జి.రామకృష్ణ, డాక్టర్ ఎస్.ఎన్.రావు, రవికుమార్, ఎస్.విష్ణుమూర్తి, కె.ఎస్.ఎన్.రాజు, ఎస్.ఆర్.కె.రాజు, కె.శ్రీనివాస్, సత్యసాయి భజన మండలి అగనంపూడి ప్రతినిధులు విందుల పైడినాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం


అన్న సమారాధనలో పాల్గొన్న గుడివాడ అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పంతులు గారీ మేడ వద్ద గల స్ఫూర్తి అనాథాశ్రమంలో పిల్లలకు గుడివాడ లతీష్ అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ గుడివాడ లతీష్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి


దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జి.గణపతిరెడ్డి, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో ఆదివారం 1263వ రోజు దీక్షా శిబిరంలో హెచ్ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిరక్షణ కమిటీ తరుపున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలను కలిసి సమస్య తీవ్రతను వివరించాల్సి ఉందన్నారు. కూటమి నాయకులు పెద్దన్న పాత్ర పోషించాల్సి ఉందని, అలాకాని పక్షంలో ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత మూటగట్టుకోవల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరంధామయ్య, దాసరి సురేష్, ముత్యాలరావు, రమణారెడ్డి, దాస్, గోవింద్, చిట్టిబాబు, సత్తిబాబు, రమణారావు, రాజు, వల్లి తదతరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన


ప్రసంగిస్తున్న విష్ణువర్ధన్‌రావు

గాజువాక: ప్రతి వినియోగదారులు వస్తువులు లేదా సేవల కొనుగోలుపై అప్రమత్తంగా ఉండాలని టీఏస్సార్, టీబీకే కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు అన్నారు. వినియోగదారుల హక్కుల కౌన్సిల్, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు గాని, సేవకు గాని కచ్చితంగా రశీదు పొందాలన్నారు. తద్వారా అవసరమైన సమయంలో వినియోగదారులకు న్యాయం జరుగుతుందన్నారు. తూనికలు, కొలతల్లో అవకతవకలపై లీగల్ మెట్రాలజీ విభాగం డిప్యూటీ కంట్రోలర్ రాధాకృష్ణ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కులపై కౌన్సిల్ సెక్రటరీ పి.ఎస్.ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు శరత్ చంద్ర, సుకన్య ప్రియ రోజా, సంతోష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా హరికథ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథ ఉత్సవాలలో భాగంగా మూడో రోజు ఆదివారం భక్త మార్కండేయ హరికథను ఒంగోలుకు చెందిన వేదవతి భాగవతారిణి అద్భుతంగా వినిపించారు. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం వేద వతి భక్తమార్కండేయ కథను ఆలపించి అలరించారు.

అలరించిన సంగీత విభావరి


సంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులు

అగనంపూడి: జీఆర్‌కే మ్యూజిక్ ఆధ్వర్యంలో స్వరగమనం పేరుతో అగనంపూడిలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. జీఆర్‌కే మ్యూజిక్స్ అధినేత ఈశ్వర రావు సారధ్యంలో చేపట్టిన కార్యక్రమంలో గాయనీ,గాయకులు కనకమహాలక్ష్మి, భాస్కరరావులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి ఆద్యాంతం మంత్రముగ్ధుల్ని చేసేలా సంగీవ విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు పలు సినిమా పాటలను వినసొంపుగా పాడి వినిపించారు. తరువాత సినిమా పిచ్చోడు చిత్ర బృందం సందడి చేసింది. కార్యక్రమంలో సినీ హీరో కుమారస్వామి, రచయిత, లఘు చిత్రాల దర్శకుడు నాని నాయుడు, దామోదర్ మ్యాజిక్ షో ఆకట్టుకుంది. జూనియర్ హరికృష్ణ హాస్య నటన అలరించింది.

టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలి


అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలని, ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ డిమాండ్ చేశారు. సీపీఎం స్టీల్‌సిటీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలపరిమితితో పిలిచిన టెండర్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తెలుగుదేశం, కూటమి నాయకులు నెలరోజుల క్రితం టోల్‌గేటును ధ్వంసం చేసి ఎత్తివేశారని ప్రచారం చేసుకుంటున్నారని, అయితే వాస్తవంగా పద్ధతి ప్రకారం టెండర్లను నిలుపుదల చేసేలా కూటమి నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. తొలగించిన కొద్దిరోజులకే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌హెచ్ఏఐ అధికారులకు అగనంపూడి టోల్‌గేటును కొనసాగించాలని ఆదేశించినట్టు తెలిసిందని, అదే వాస్తవమైతే టీడీపీ ద్వంద్వనీతి బయటపడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో స్టీల్‌జోన్ కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, ఉరివిటి మరిడయ్య, శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు పంకజ్, కీర్తి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని వెంపళ్లనగర్ ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాల్టీ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 100 మందికి వైద్యులు పంకజ్ డోంగ్రే, బెల్లాల కీర్తి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు కీర్తి, పంకజ్ మాట్లాడుతూ ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నవారికి వచ్చే నెల 10వ తేదీలోపు మా వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాలిటి ఐ కేర్ ఆస్పత్రి వినాయక నగర్‌కి వస్తే మరోకసారి ఆధునిక పరికరాలతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

గంగవరం రోడ్డులో ప్రమాదాల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


గంగవరం రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాపర్ బోర్డు, విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్

పెదగంట్యాడ: గంగవరం గ్రామానికి వెళ్లే రహదారిలో ప్రమాదాల నివారణకు న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద వేగాన్ని నియంత్రించేందుకు గానూ స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే అక్కడ ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఓ కానిస్టేబుల్‌ను విధుల్లో ఉంచారు. పెదగంట్యాడ నుంచి గంగవరం వైపు వెళ్లే రహదారిలో వెంకన్నపాలెం కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో 'మలుపు.. ముప్పు' శీర్షికన ఈ నెల 28న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో న్యూపోర్టు పోలీసులు స్పందించారు. హుటాహుటిన అక్కడ స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ఓ కానిస్టేబుల్‌ను విధుల్లో ఉంచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక జీవితం..అదృష్టం


ఉక్కు ఉద్యోగి సాంబశివరావును సత్కరిస్తున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ

అగనంపూడి: ఆధ్యాత్మిక చింతనతో తరించే అదృష్టం కొద్దిమందికే దక్కుతుందని విశాఖ స్టీల్‌ప్లాంట్ డబ్ల్యూఆర్ఎం విభాగాధిపతి ఎస్.శ్రీనివాసశర్మ అన్నారు. 87వ వార్డు లక్ష్మీపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష సేవలు అందిస్తున్న ఉక్కు ఉద్యోగి సాంబశివరావును ఆలయ కమిటీ, వికాస్ తరంగిణి అన్నదాన కమిటీ ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అందుతున్న సేవల్లో విరివిగా పాల్గొంటున్న సాంబశివరావును కొనియాడారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.అశోక్‌రాజు, కార్యదర్శి ఎస్ఆర్‌సీ వర్మ, ప్రతినిధులు సుబ్బరాజు, వీర్రాజు, వరహాలబాబు, కృష్ణంరాజు, శ్రీరామూర్తి, చంద్రశేఖర్, నరసింహ గోపాల్, అన్నదాన, వికాస్ తరంగణి మిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి..రక్తదానం చేసి...


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య జన్మదినోత్సవాన్ని పురస్కంచుకొని విద్యార్థులు రక్తదానం చేపట్టారు. 2వందల మంది విద్యార్థులు పాల్గొని వంద యూనిట్ల రక్తదానం చేశారు. తరువాత ఆవరణలో వెయ్యి మొక్కలు నాటారు. సమీప గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు రత్తయ్య రోల్ మోడల్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, విద్యార్థి విభాగం డీన్ బి.సతీష్, ఎన్ఎస్ఎస్ పీఓ సుందర రామమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కళాశాల ఆవరణలో..

విజ్ఞాన్ రత్తయ్య జన్మదినోత్సవం సందర్భంగా విజ్ఞాన్ ఫార్మా కళాశాల ఆవరణలో ఉచితంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తరువాత మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ సత్యలక్ష్మి పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెదగంట్యాడ: విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఓ వ్యక్తిపై న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. నగరంలోని మర్రిపాలేనికి చెందిన కొరిపల్లి కృష్ణ అనే వ్యక్తి గాజువాక డిపో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి రోజూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీ బస్సులో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం కూడా ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హెచ్‌బీ కాలనీకి శనివారం సాయంత్రం వస్తుండగా మార్గ మధ్యంలో కొత్త గాజువాక వద్ద రమేష్ అనే వ్యక్తి బస్సెక్కాడు. అయితే అతను పెదగంట్యాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. స్పీడ్ బ్రేకర్ల వద్ద నెమ్మదిగా ఎందుకు వెళ్లడం లేదంటూ డ్రైవర్‌ను దుర్భషలాడడంతో పాటు ఆగ్రహంతో డ్రైవర్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో బాధితుడు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు రమేష్ అనే వ్యక్తిపై న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.